క్లుప్తంగా

విశేషంగా వెంకన్న కల్యాణోత్సవం



వెంకన్నకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్ తదితరులు

సింహాచలం: వెంకటాద్రిపై నిర్వహిస్తున్న చాతుర్మాస పూజల్లో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు వేంకటేశ్వర స్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టం పజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు రామానుజమ్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు.

ఆస్పత్రి అభివృద్ధికి మండల పరిషత్ నిధులు



అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ప్రస్తుతం అందిస్తున్న వైద్య సేవలపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. మరింత మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రి అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నిర్వహణకు అవసరమైతే మండల పరిషత్ నిధులు కేటాయిస్తామని తెలిపారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, ఎంపీడీవో రమేష్ నాయుడు, పీహెచ్ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం చెల్లించాలి



సినిమాహాలు కూడలి వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ప్రమాదంలో మృతి చెందిన ఒక్కో కార్మికుడి కుటుంబానికి రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పరవాడ సినిమాహాలు కూడలి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. అంతకు ముందు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని గనిశెట్టి పరామర్శించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఎన్టీపీసీ యాజమాన్యం భద్రత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదం జరిగిందన్నారు. నిర్వహణ కూడా సక్రమంగా లేక ట్రాక్ వే కూలిపోయి ఇద్దరు కార్మికుల మరణానికి కారణమైందన్నారు. యాజమాన్యం పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దేవస్థానం పాఠశాలకు యూనిఫారాల వితరణ



విద్యార్థులకు యూనిఫారాలు అందజేస్తున్న శ్రీవ్యాస పీఠం ప్రతినిధులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నత పాఠశాలలో కొత్తగా చేరిన 65 మంది విద్యార్థులకు విశాఖకు చెందిన శ్రీ వ్యాస పీఠం ఆధ్యాత్మిక సంస్థ శుక్రవారం యూనిఫారాలు వితరణగా అందజేసింది. రూ.1.20 లక్షలు వెచ్చించినట్టు సంస్థ అధ్యక్షుడు వీఎస్ఎన్.శాస్త్రి చెప్పారు. విద్యార్థికి రెండు జతల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ ట్రెజరర్ రవికుమార్, సభ్యులు నర్సింహమూర్తి, ప్రకాశరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దేశ సమగ్రతపై భావితరాలకు స్ఫూర్తి నింపడమే లక్ష్యం

- జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి
- ఘనంగా నా భూమి- నాదేశం



విశ్రాంత జవాన్లను సత్కరిస్తున్న జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి తదితరులు



సబ్బవరం దండి కోనేరు వద్ద మొక్క నాటుతున్న జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి తదితరులు

సబ్బవరం: దేశ సమగ్రత, సౌభ్రాతృత్వంపై భావితరాలకు స్ఫూర్తిని కలిగించడమే నా భూమి–నాదేశం కార్యక్రమం ఉద్దేశ్యమని జిల్లా పరిషత్ సీఈవో పి. శ్రీరామమూర్తి అన్నారు.మండలంలోని సబ్బవరం శివాలయాన్ని ఆనుకుని ఉన్న ధర్మకోనేరు వద్ద శుక్రవారం నిర్వహించిన నాభూమి–నాదేశం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన చేతులమీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర భారతావని 75 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాభూమి–నాదేశం...నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం అనే కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతుందన్నారు. 75 రకాల మొక్కల పెంపకం చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని బహిరంగ ప్రదేశాలు, చెరువు గట్లపై మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాయుధ దళాల్లో పనిచేసి రిటైర్ అయిన వారిని సన్మానించారు. పెదనాయుడుపాలేనికి చెందిన కైకాల సింహాచలరావు మృతి చెందడంతో ఆయన సోదరుడు సన్యాసిరావును, గొర్లివానిపాలేనికి చెందిన గొర్లి త్రిమూర్తులు, గొర్లి సత్యనారాయణ, జోడుగుళ్లకు చెందిన బలిరెడ్డి ఉమా మహేష్,సబ్బవరానికి చెందిన దెందేటి సుబ్రహ్మణ్యం తదితరులను ఆయన శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు,సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంపీడీవో రమేష్ నాయుడు, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాల నాయుడు, పార్టీ నాయకులు బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, ఎంపీటీసీలు బైలపూడి దేముడుబాబు, గొర్లి చైతన్య,పంచాయతీ ఈవో కార్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాభూమి–నాదేశం, నేల తల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి విద్యార్థులతో ప్రాణ్ ప్రతిజ్ఞ చేయించి అనంతరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీర సైనికులను గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించారు.

పరవాడ మండలంలో..

పరవాడ: మాతృభూమి కోసం సర్వం త్యాగం చేసిన వారికి ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలని వైఎస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు అన్నారు. రావాడ గ్రామంలో నా భూమి- నా దేశం ,నేలతల్లికి వందనం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు నేల తల్లికి నమస్కరించి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.ఎస్.నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పార్టీ నాయకులు పల్లా గోవిందు, గ్రామ పంచాయతీ కార్యదర్శి అనురాధ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- నాయుడుపాలెం రాముడుగారి చెరువు వద్ద నా భూమి- నాదేశం, నేలతల్లికి వందనం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు దేశభక్తి కలిగి ఉండాలన్నారు. నేల తల్లికి నమస్కరించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముత్యాలునాయుడు, పంచాయతీ కార్యదర్శి పోతల రమేష్, మాజీ ఎంపీటీసీ కె.శ్రీరామ్మూర్తి, పార్టీ నాయకులు పైల ముత్యాల నాయుడు, యమహానాయుడు, శ్రావణ్, వీఆర్వో కమల, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి



రావాడలో నా భూమి, నా దేశం కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు



రాముడుగారి చెరువు వద్ద శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సర్పంచ్ వరలక్ష్మిసీతారామయ్య, అధికారులు

భక్తిగీతాలు, నృత్యాలతో అలరించిన విద్యార్థులు



కీర్తనలు ఆలపిస్తున్న నాట్యపరిమళ అకాడమీ విద్యార్థులు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

ఎంవీపీకాలనీ: వేంకటేశ్వర స్వామి శ్రావణ సంగీతోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. విశాఖ సాగర తీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం వేదికగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నాట్యపరిమళ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు శ్రీవారి గీతాలను ఆలపించి అలరించారు. మయూరి నృత్య నికేతన్ విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రోజు పాఠశాలలకు చెందిన విద్యారులు ఈ ఉత్సవాల్లో నాట్యం, సంగీతం, ఇతిహాసాలు, పురాణ గాథలపై ప్రదర్శనలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 16 వరకు సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని, ప్రతి రోజు రాత్రి 8.30 గంటలకు హారతి, ప్రసాద వితరణ నిర్వహిస్తామని చెప్పారు.

ఎంవీపీ బస్‌స్టేషన్ పార్సిల్ కౌంటర్ పరిశీలన

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ ఆర్టీసీ బస్ స్టేషన్‌లోని పార్సిల్ కౌంటర్ పాయింట్‌ను శుక్రవారం ఏపీఎస్ ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఆపరేషన్స్ అండ్ కమర్షియల్ బి.అప్పలనాయుడు ఆకస్మికంగా పరిశీలించారు. ఏటీపీ పార్సిల్ సర్వీసులను పర్యవేక్షించారు. వినియోగదారులకు అందిస్తున్న సేవలను, పార్సిళ్ల చేరవేతకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్సిల్స్ చేరవేతలో వినియోగదారులకు నమ్మకమైన, వేగవంతమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఎంవీపీ బస్‌స్టేషన్‌లోని పార్సిల్ కేంద్రాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రంలోని ఏమూలకైనా ఇక్కడి నుంచి సర్వీసులు అందుబాటులో ఉన్నాయన్నారు. సూపర్ వైజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్షియల్ మార్కెట్‌పై అవగాహన

ఏయూక్యాంపస్: స్టాక్ మార్కెట్‌లో అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ సీఈవో డాక్టర్ సతీష్‌కుమార్ ఆర్య అన్నారు. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో శుక్రవారం ఫైనాన్షియల్ మార్కెట్ సర్వీసెస్‌లో అవకాశాలు అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జీఎంఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జున రావు, అపోలో హాస్పిటల్స్ అధినేత ప్రతాప్‌రెడ్డిల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సంస్థ సీనియర్ మేనేజర్ కె.రాజేశ్వర రెడ్డి స్టాక్ మార్కెట్, షేర్లు, ఇన్స్యూరెన్స్, మ్యూచువల్ ఫండ్స్ తదితర అంశాలను వివరించారు. ఫండ్‌ల నిర్వహణపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మేనేజర్ వై.సాంబమూర్తి ఇంటర్న్‌షిప్‌ల అందించే విధానాన్ని వివరించారు. మూలధనాన్ని ఏ విధంగా వినియోగించడవచ్చు, జ్ఞానాన్ని సంపదగా మార్చుకోవడం ఎలా అనే విషయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఆచార్య ఎస్.సాంబశివరావు, డాక్టర్ బి.సుబ్బయ్య, సురేష్, బుజ్జిబాబు తదిరతులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు పెంచాలి



సంఘీభావం తెలుపుతున్న వీవర్స్ ఫెడరేషన్ సంఘం నాయకులు

పెదగంట్యాడ: చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు కోరారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేతలపై విధించిన జీఎస్టీని రద్దు చేయాలని, నేత నేసే మహిళా కార్మికులకు కూడా నేతన్న నేస్తం పథకం వర్తింపజేయాలని కోరారు. సొసైటీల్లో నిల్వ ఉన్న వస్త్రాలను ఆప్కో ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేత కార్మికుల సమస్యలపై ఈ నెల 27న పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సమావేశానికి చేనేత 18 కులాలకు చెందిన వారు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కర్రి రవి, నాలి అప్పారావు, కొప్పల రామ్‌కుమార్, చిక్కా సత్యనారాయణ, మాడెం సూరి అప్పారావు, నామాని, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికులకు నిలిపివేసిన అలవెన్సులు వెంటనే చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకుల డిమాండ్ చేశారు. కార్మికులు అలవెన్సుల కోసం శుక్రవారం మధ్యాహ్నం ఉక్కు పరిపాలన భవనం వద్ద ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ కార్మికులకు గతంలో ఇచ్చే ఎస్.ఎం.ఎ, ఎ.ఎస్.ఎం.ఎ, ఐఆర్‌లను నిలిపివేయడం అన్యాయమన్నారు.

కార్మికులు వాటిని చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం హెచ్‌ఆర్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

14న ఏపీఐఐసీ ఐలాలో రక్తదాన శిబిరం

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ ఏపీఐఐసీ ఐలా మరియు లఘు ఉద్యోగ భారతి సంయుక్తంగా ఈ నెల 14వ తేదీన రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) అధ్యక్షుడు ఎస్.పాండురంగ ప్రసాద్, ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), లఘు ఉద్యోగ భారత్ విశాఖపట్నం అధ్యక్షుడు ఎ.రమేష్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. ఐలా భవనంలో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్న శిబిరాన్ని పారిశ్రామిక వేత్తలు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా తీసుకెళ్లారు. మంగళ వాయిద్యాల నడుమ అభిషేకాలు నిర్వహించి స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. నగరానికి చెందిన జ్యోతి కుటుంబ సభ్యులు శ్రీవారికి పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



నగేష్‌కుమార్ (ఫైల్)

మల్కాపురం: తనను విధుల నుంచి నిలిపివేశారని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లో ఉరి పోసుకుని మృతి చెందాడు. ఈ ఘటనపై మల్కాపురం సీఐ జి.డి. బాబు తెలిపిన వివరాలు ... జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సమీపంలోని జనతాకాలనీ వద్ద కొలపర్తి నగేష్‌కుమార్ భార్యతో కలిసి కొంత కాలం నుంచి నివాసం ఉంటున్నాడు. ఈ వ్యక్తి ఇదే వార్డు పరిధి ఆర్‌కే పురంలోని ఓ పెట్రోల్ బంక్‌లో సూపర్‌వైజర్‌గా కొంత కాలం నుంచి పని చేస్తున్నాడు. అయితే వారం రోజుల కిందట నగేష్ కుమార్ పని చేస్తున్న పెట్రోల్ బంక్ విధులకు ఆలస్యంగా వెళ్లాడు. దీనిపై మరో సూపర్‌వైజర్ విధులకు ఇంత ఆలస్యంగా వస్తే ఎలా అని ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇరువురు మధ్య వాదన జరిగింది. ఇది బంక్ ఉన్నతాధికారి, కాంట్రాక్టర్ దృష్టికి వెళ్లడంతో నగేష్‌ను విధుల నుంచి నిలిపివేశారు. దీంతో మనస్తాపానికి గురైన నగేష్ శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి తన గదిలో ఫ్యాన్‌కు ఉరి పోసుకుని మృతి చెందాడు.విషయం తెలుసుకున్న పోలీసులు ఆరా తీస్తున్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ జి.డి.బాబు తెలిపారు.

సచివాలయాలతో ప్రజల చెంతకే సేవలు

సబ్బవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ అందిస్తున్న సేవలు ప్రజల్లో చిరకాలం నిలిచిపోతాయని జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి అన్నారు. సబ్బవరంలోని శివాలయం వద్ద ఆయన సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల గురించి మాట్లాడారు. కరోనా వ్యాక్సిన్ వేసుకోవడానికి అపోహతో ప్రజలు ముందుకు వచ్చేవారు కాదన్నారు. అలాంటి సమయంలో వలంటీర్లు,సచివాలయ సిబ్బంది ధైర్యంగా ముందుకు వచ్చి వ్యాక్సిన్ వేయించుకోవడంతో వ్యాక్సినేషన్‌కు విపరీతమైన డిమాండ్ పెరిగి విజయవంతంగా పూర్తయ్యిందన్నారు. కరోనా మరణాలు మన రాష్ట్రంలో తక్కువగా నమోదయ్యాయని చెప్పారు. వలంటీర్లు ఇంటింటికీ సర్వే నిర్వహించి కోవిడ్ లక్షణాలు ఉన్నవారిని గుర్తించి సోకినవారిని వేరు చేయడం వల్ల విస్తరించకుండా నివారించగలిగామన్నారు. అలాగే ప్రభుత్వ అమలు చేస్తున్న నవరత్న పథకాలు ప్రజల చెంతకే చేరడానికి వలంటీర్లు, సచివాలయ వ్యవస్థే కారణమన్నారు.ఇదే స్ఫూర్తితో వలంటీర్లు,సచివాలయ సిబ్బంది మరింత సమర్థంగా పనిచేయాలని సూచించారు.

వైభవంగా ఆర్జిత సేవలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేన పూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఉభయదాతలకు ప్రసాదం అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అర్చకుడు కుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బిగ్ డేటా అనలిటిక్స్‌లో విద్యార్థినులకు శిక్షణ



సర్టిఫికెట్లతో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులు

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహానంద ఫౌండేషన్ సహకారంతో ఆ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, జవహర్ నాలెడ్జి సెంటర్ సంయుక్తంగా 70 మంది విద్యార్థినులకు 180 గంటల పాటు బిగ్ డేటా అనలిటిక్స్‌లో శిక్షణ ఇచ్చారు. ఎలక్ట్రానిక్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ సహకారంతో శ్యాంసంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ ఈ శిక్షణను స్పాన్సర్ చేసింది. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు సర్టిఫికెట్లు, కిట్లు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. మహానంద ఫౌండేషన్ అధినేత కేఎస్‌బీ కిషోర్‌కుమార్ డేటా అనలిటిక్స్, బిగ్ డేటా టెక్నాలజీస్‌లో అందుబాటులో ఉన్న ఉద్యోగావకాశాల గురించి విద్యార్థినులకు తెలియజేశారు. డేటాప్రో సీనియర్ ఫ్యాకల్టీ ఎల్. విజయ్ ఇంటర్వ్యూల్లో సాంకేతిక రౌండ్ల సమయంలో ఎలా నైపుణ్యం ప్రదర్శించాలో వివరించారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ లెక్చరర్, జేకేసీ కో ఆర్డినేటర్ ఇన్‌చార్జి డి. అరుణపద్మ విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో లెక్చరర్ పద్మకుమారి, జేకేసీ మెంటార్లు వీఎస్ రాజు, టి. స్వప్న, డేటా సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ సంస్థల వేధింపులు ఆపాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విశాఖ డ్రైవర్స్ యూనియన్ నాయకులు

సీతమ్మధార : కోవిడ్ సమయంలో ఇచ్చిన మారటోరియంను రెట్టింపు వసూలు చేస్తున్న కంపెనీలపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విశాఖ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విశాఖ డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ మారిటోరియంకు (ఆరు వాయిదాలు) చివర్లో కట్టే విధంగా అవకాశం ఇచ్చారని, ఇప్పుడు రెట్టింపు వాయిదాలు కట్టమని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు వేధిస్తున్నాయని అన్నారు. కార్లకు ఫైనాన్స్ ఇచ్చిన కొన్ని సంస్థలు ఒక వాయిదాకి రెండు వాయిదాలుగా వసూలు చేస్తున్నాయని అన్నారు. ఒక వ్యక్తి ఐదు నెలలు ఈఎంఐ కట్టకపోతే ఇప్పుడు పది ఈఎంఐలు కట్టమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ క్యాబ్ డ్రైవర్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ శ్రీ నివాస్, కె.పోలునాయుడు, కమిటీ మెంబర్లు శరత్, నాయుడు, కృష్ణ, మనోహర్, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అందరి బాధ్యత



దీక్షలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజలందరి ఆస్తి అని, దానిని కాపాడుకునేందుకు ప్రతీ తెలుగువారు పోరాటానికి సిద్ధం కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 911వ రోజు శుక్రవారం సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తే విశాఖ ఉక్కుకు సానుకూల స్పందన లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం దేశంలోని నిరుద్యోగులను మోసం చేస్తోందని, కార్మికులకు పని లేకుండా చేస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఎంతటి త్యాగానికైన సిద్ధంగా ఉన్నామని, కేంద్రప్రభుత్వం ఇప్పటికైనా తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పరేడ్ రిహార్సల్ పరిశీలన



పరేడ్ రిహార్సల్‌ను పరిశీలిస్తున్న అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లా పోలీసులు పరేడ్ కోసం విశాఖపట్నం కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో రిహార్సల్ నిర్వహిస్తున్నారు. దీనిని శుక్రవారం ఆ జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయనకు ఇక్కడి సిబ్బంది గౌరవ వందనం చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు 15 వేడుకలు అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దాని కోసం కవాతు బాగా జరపాలని రిహార్సల్ చేస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పరేడ్ ఆకట్టుకునేలా రిహార్సల్ చేయాలని సిబ్బందికి సూచించారు. అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏఆర్‌ఐలు బి.రామకృష్ణారావు, కె.వెంకటరావు, ఎం.సతీష్, కె.అరవింద్ కిశోర్ పాల్గొన్నారు.